క్లుప్తంగా

ఆశీర్వాదం



జన్మదిన వేడుకలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక వైవీఆర్ ఫంక్షన్ హాల్‌లో చౌటపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గండ్లూరు జగన్‌మోహన్‌రెడ్డి మనువడు సన్‌హిత్‌రెడ్డి మొదటి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు ఈ వేడుకలో పాల్గొని సన్‌హిత్‌రెడ్డిని ఆశీర్వదించారు.

రేపు వేలంపాట

బద్వేలు అర్బన్ : బద్వేలు అటవీ కార్యాలయం పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నానా జాతి కర్రకు గురువారం సిద్దవటం రోడ్డులోని ఫారెస్టు గోడౌన్‌లో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ నయీమ్‌అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.100లు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, హెచ్చు పాటదారుడికి పూర్తి మొత్తం చెల్లించిన వెంటనే నానా జాతి కర్రను స్వాధీనం చేయడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు అటవీ క్షేత్రాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మృత్యుంజయ హోమం



హోమంలో పూర్ణాహుతిని సమర్పిస్తున్న వేద పండితులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, ఉపగ్రహ, ఉపదేవత, మృత్యుంజయ హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమం ఆలయ ఈఓ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా అర్చకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొర్రపాడు విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీలు

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం జె.సురేష్ బాబు, పీఈటీ వెంకటసుబ్బయ్యలు తెలిపారు. వారు ఆ పాఠశాలలో మంగళవారం మాట్లాడుతూ రామనపల్లెలో జరిగిన పోటీలలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఏడు మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అండర్-14 బాలుర విభాగంలో జె.అభినయ్, బాలికల విభాగంలో జి.చంద్రిక, అండర్-17 బాలుర విభాగంలో ఎం.సంతోష్ కుమార్, జె.తేజేస్ కుమార్, బాలికల విభాగంలో ఎం.స్పందన, అండర్-19 విభాగంలో జి.శ్రీహరి, అఫ్జల్, ఎస్.మహబూబ్ బాష, సుదీపా స్టాండ్‌బైలో ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థులను హెచ్‌ఎం, పీఈటీలతో పాటు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోహరమ్మ

బద్వేలు అర్బన్ : పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జిల్లా మలేరియా అధికారి పి.మనోహరమ్మ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలికల వసతిగృహాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాల, వసతిగృహాల పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వసతిగృహంలో విద్యార్థులకు వంట వండే సిబ్బంది పరిశుభ్ర వాతావరణంలో శుభ్రంగా వంట చేయాలని సూచించారు. వసతిగృహ, పాఠశాల పరిసరాల్లో ఉన్న డ్రైనేజీలపై మూతలు వేయించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. వాతావరణంలో మార్పుల వలన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. అనంతరం హైస్కూల్‌లో జరుగుతున్న వైద్య శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి సౌమ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి, హాస్టల్ వార్డెన్ లక్ష్మీదేవి, సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు, టెక్నీషియన్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీరాములయ్య, జనార్ధన్‌రావు, వెంకటసుబ్బయ్య, ఏఎన్‌ఎం స్వాతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ బోదనబోయిన నిర్మలదేవి

కలసపాడు : ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని ఎంపీపీ బోదనబోయిన నిర్మలదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ మహబూబ్‌బీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారుల సహకారం ఎంతో అవసరమని, కలిసికట్టుగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. వర్షాకాలంలో గ్రామాల్లో నీటి ట్యాంకులు క్లీన్ చేసి మంచినీటిని అందించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ మహబూబ్‌బీ మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కలబెడద ఎక్కువగా ఉందని తమ దృష్టికి వచ్చిందని, అధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో మండలంలో కుక్కలబెడద లేకుండా చేస్తామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము మాట్లాడుతూ గ్రామాల్లో పైపులైను లీకేజీలను సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు అరికట్టాలని తెలిపారు. ఆర్ఐ సింధూజ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు అందజేస్తుందన్నారు. ఈఓపీఆర్‌డీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీలను పరిశుభ్రంగా ఉంచుకుని గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ చేయాలని కోరారు. అలాగే ఇంటి పన్నులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకోవచ్చని తెలిపారు. అనంతరం అన్నిశాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు ఎ.వి.భాస్కర్‌రెడ్డి, వావిళ్ల మల్లిక, సర్పంచ్‌లు సూధా రామకృష్ణారెడ్డి, శివలీల, వెంకటయ్య, పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, వైద్యాధికారి సాయితేజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిప్రియ, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌బాష, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఆరోగ్యంగా ఉండండి

మైదుకూరు : హెచ్‌ఐవీ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ఆరోగ్యంగా ఉండాలని మైదుకూరు ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎంవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవీపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల, కలుషిత రక్తాన్ని ఎక్కించడం వల్ల హెచ్‌ఐవీ సోకుతుందన్నారు. యువతీ యువకులు శారీరక ఆకర్షణలను అదుపులో ఉంచుకుని హెచ్‌ఐవీ బారిన పడకుండా ఉండాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీ సోకినట్టయితే ఆ వ్యాధి బిడ్డకు సోకకుండా నిరోధించవచ్చన్నారు. ఏఆర్ఎస్‌కే కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. దీనిని నివారించేందుకు ఆకు కూరలు, పాలు, పండ్లు, గుడ్డు వంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మైదుకూరు : విద్యార్థులు చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులతో సీఐ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే సిగరెట్, మద్యం, గంజాయి వంటి వాటిని అలవాటు చేసుకుంటే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేందుకు చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.

ప్రకృతి వ్యసాయంపై దృష్టి సారించండి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

గోపవరం : ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతు దృష్టి పెట్టాలని ఏఓ విజయరావు అన్నారు. మంగళవారం మండలంలోని రాచాయపేట, బెడుసుపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ వీలైనంత వరకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడటం వలన రైతులకు పెట్టుబడి తగ్గడమే కాక దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. 50 శాతం సబ్సిడీతో పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకెళ్ళవచ్చని తెలిపారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా పంటల సీజన్ మొదలు కాలేదని, మొదలైన వెంటనే అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ఓబయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు

పోరుమామిళ్ల : ఓజోన్ పొర సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు భూమి పడకుండా కాపాడుతుందని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రావు మాట్లాడుతూ ఓజోన్ పొరకు హాని కలిగించే ఫ్రిడ్జ్, ఏసీ, మోటారు వాహనాల వినియోగం తగ్గించాలని పిలుపునిచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కరుణాకర్ మాట్లాడుతూ ఓజోన్ పొర భూమిపై జీవాన్ని రక్షిస్తుందని, దాన్ని కాపాడుకోవాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహారెడ్డి, సులోచన, శ్రీధర్‌మూర్తి, వెంకటరావు, శోభన్ బాబు, సబిత, గురమ్మ, పర్వీన్, ఈశ్వరయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తవ్వా సురేష్



తవ్వా సురేష్



గువ్వా మహేష్



ఎన్.సునీత

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయనగరం పట్టణంలో ఈనెల 14న జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రొద్దుటూరుకు చెందిన తవ్వా సురేష్‌ను ఎన్నుకున్నారు. అలాగే పట్టణానికి చెందిన గువ్వా మహేష్‌ను రాష్ట్ర యూత్, సోషల్ మీడియా సబ్ కమిటీ కన్వీనర్‌గా, ఎన్.సునీతను రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. మంగళవారం జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు జనవిజ్ఞాన వేదిక కమిటీలో విధులు నిర్వహించిన తరహాలోనే రాష్ట్ర కమిటీలో కూడా తమ విధులు సమర్థవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులకు ప్రొద్దుటూరు కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

30లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు రెడ్ల సేవా సంఘం వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 19న సాయంత్రం 4 గంటలకు పేద రెడ్ల విద్యార్థులకు 2025-26 సంవత్సరానికి సంబంధించి స్కాలర్ షిప్‌లను పంపిణీ చేయనున్నట్లు సంఘం అధ్యక్షులు డాక్టర్ డి.నాగదస్తగిరిరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మెడిసన్, ఇంజనీరింగ్, సీఏ, ఎంబీఏ, పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ కళాశాల స్టడీ సర్టిఫికెట్‌ను దరఖాస్తుకు జతపరచాలని సూచించారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో కనీసం 60 శాతం మార్కులు పొంది ఉన్న వారు ఇందుకు అర్హులని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో సీట్‌పొందిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హతగల విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు డాక్టర్ డి.నాగదస్తగిరిరెడ్డి హాస్పిటల్‌లో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు సంఘం ఉపాధ్యక్షుడు డి.రామిరెడ్డి 9182064339 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

వంతెనపై రాకపోకలు నిషేధం



వంతెనపై కంప వేసిన రెవెన్యూ సిబ్బంది

అట్లూరు : మండలంలోని వేమలూరు సమీపంలోని సగిలేరు నది లో లెవెల్ వంతెనపై వాహనాల రాకపోకలను నిషేధించామని తహసీల్దార్ సుబ్బలక్షుమ్మ, ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. వేమలూరు దగ్గర సగిలేరు నదిపై ఉన్న లో లెవెల్ వంతెనపై మూడు అడుగుల మేర సోమశిల వెనుక జలాలు చేరడంతో పూర్తిగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రమాదం అని తెలిసి గత్యంతరం లేని పరిస్థితుల్లో కొంత మంది వంతెనపై రాకపోకలు నిర్వహిస్తుండటంతో సాక్షి దినపత్రికలో మంగళవారం 'ముంపు... ముప్పు' అనే శీర్షికన తహసీల్దార్, స్థానిక ఎస్ఐ అభిప్రాయాలతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన తహసీల్దార్ సుబ్బలక్షుమ్మ, ఎస్ఐ రామకృష్ణ సగిలేరు వంతెనపై పూర్తిగా రాకపోకలను నిలిపివేస్తూ కంప వేసి అక్కడ రెవెన్యూ గ్రామ సహాయకులను కాపలాగా నియమించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా
అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిసరఫరా చేయు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నీటిసరఫరా చేయు సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పైపులైను లీకేజీలు, మరమ్మతులు వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వాటిని పరిష్కరించి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. అలాగే నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు తరచూ క్లోరిన్ టెస్టు చేస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రజలకు అవగాహన కల్పించి నీరు వృథా కాకుండా చూడాలని సూచించారు. అక్రమ కుళాయి కనెక్షన్లు రెగ్యులర్ చేయించడంతో పాటు నీటి పన్నులు వసూలు చేయాలని కోరారు. మున్సిపల్ ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఖాజీపేట : న్యాయవ్యవస్థలోని చట్టాలపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీ యామిని అన్నారు. మండలంలోని ఆంజనేయపురంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. నిర్బంధ విద్య తోపాటు సివిల్ కేసులు, బాల్య వివాహాలు, భ్రూన హత్యలపై అవగాహన కల్పించారు. లీగల్ సెల్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ జాన్‌ఎర్విన్, మైదుకూరు బార్ అధ్యక్షుడు శివప్రసాద్, ఖాజీపేట తహసీల్దార్ రమణమ్మ, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఖాజీపేట సీఐ వంశీధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగాలకు ఎంపిక



టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు సునీల్, సృజన్ తెలిపారు. ఎస్జీటీ విభాగంలో శివసునీత, భారతి, సావిత్రి, కృష్ణవేణి, అనూష, స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో రాజేశ్వరి, మహబూబ్‌బాషా, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషులో హాజీర బీబీ, ధరణి, టీజీటీ విభాగంలో శివనాథ్, స్కూల్ అసిస్టెట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో చంద్రకాంత్ ఎంపికయ్యారు. వీరిని కోచింగ్ సెంటర్ డైరెక్టర్లతోపాటు అధ్యాపకులు అభినందించారు.

బి.మఠం మండల అభివృద్ధికి సహకరించాలి

బ్రహ్మంగారిమఠం : మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సహకరించని అధికారులు నా మండలంలో ఉండకూడదన్నారు. బ్రహ్మంగారిమఠం దేవస్థానం పరిధిలో ఆక్రమణలు ఎవరైనా చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బి.మఠంలో రోడ్లు వెడల్పు, సీసీ రోడ్లు వేశారన్నారు. కొంతమంది మళ్లీ రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అటువంటివారిపై ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరకిషోర్, మైదుకూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఏపీ రవీంద్ర, మండల సింగల్‌విండో అధ్యక్షుడు సాంబశివారెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి వీరకిశోర్ తెలిపారు. మండల అధ్యక్షుడు తెలిదేల లక్ష్మయ్య అధ్యక్షతన జరగనున్న మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులతోపాటు మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నేటి నుంచి 'స్వస్త్ నారీ–స్వశక్త్ పరివార్ అభియాన్'



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

కలసపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వస్త్ నారీ–స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నేటి నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మండలంలోని అన్ని విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లలో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ తెలిపారు. మంగళవారం వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు స్వస్త్ నారీ స్వశక్త్ పరివార అభియాన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా రెండు వారాల పాటు ×ఆరోగ్య కారణమైన మహిళలు.. బలమైన కుటుంబాల్లు అనే నినాదంతో ఈ కార్యక్రమం జరుగుతుందని, అన్ని సచివాలయాల్లో క్లినిక్‌లలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17న చింతలపల్లి, 18న ఎగువ రామాపురం, 19న ఎగువ తంబళ్లపల్లె, 20న లింగారెడ్డిపల్లె, 22న మహానందిపల్లె, 23న పిడుగుపల్లె, 24న పుల్లారెడ్డిపల్లె, 25న తెల్లపాడు, 26న రాజుపాలెం, అక్టోబర్ 1వ తేదీన చెన్నుపల్లె గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మహిళలు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.